

టమాట కిలో రూ.20
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 పలికింది.



టన్ను చీనీ రూ.28 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 35 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్ఠం/కనిష్ఠం
31.9°/13.2°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరిగాయి.

న్యూస్‌రీల్

నేడు కదిరి టౌన్ పీఎస్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



నూతన పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

కదిరి టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన టౌన్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆదివారం కార్మికశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్, కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి, కలెక్టర్ బసంతకుమార్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ భవ్యకిశోర్, సీఐ మధు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెంచాలి
- వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు పెరగాలి
- అధ్యాపకులకు ఇంటర్ బోర్డు ఆర్జేడీ రవి ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ రవి

అమరాపురం: 'వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించండి..ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేసి అందుకు అనుగుణంగా బోధించాలి. ఈసారి ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇంటర్ బోర్డు ఆర్జేడీ రవి అధ్యాపకులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య తగ్గిందని, అందువల్ల రానున్న వేసవిలో అధ్యాపకులంతా పదోతరగతి విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన, సౌకర్యాలు తదితర వాటిని వివరించి పిల్లలను అడ్మిషన్ చేసేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం చదువుతున్న ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని బాగా చదువుకోవాలన్నారు. ఇంటర్ చాలా కీలకమని ఇక్కడ తప్పు చేస్తే భవిష్యత్‌లో బాధపడతారన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుచేసుకుని బాగా చదవాలన్నారు. ఆయన వెంట డీవీఈఓ రఘునాథరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు ఉన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

చిలమత్తూరు: మద్యానికి డబ్బులివ్వలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం చిలమత్తూరు ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు...కాలనీకి చెందిన సత్యనారాయణప్ప (44) మద్యానికి బానిసయ్యాడు. పనులకు కూడా వెళ్లకుండా నిత్యం మద్యం సేవిస్తూ గడిపేవాడు. అందుకు అవసరమైన డబ్బు కోసం ఇంట్లో వాళ్లని వేధించేవాడు. ఈ క్రమంలోనే శనివారం మద్యం తాగేందుకు డబ్బు కావాలని భార్య ఆనందమ్మను అడిగాడు. ఆమె తన వద్ద డబ్బులేదని చెప్పడంతో మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ.. ఆధునిక బడి

వైఎస్ జగన్ సర్కార్ అంగన్‌వాడీలను ఆధునిక బడులుగా తీర్చిదిద్దింది. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు ఆంగ్లంలోనే పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తూ ఉజ్వల భవితకు బాటలు వేస్తోంది. అత్యవసరంలో వాడుకునేందుకు వీలుగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచింది.

- ప్లేస్కూళ్లకు దీటుగా ఇంగ్లిష్ మీడియం
- నాడు- నేడుతో ఆధునిక సౌకర్యాలు
- కేంద్రాలకు పుస్తకాలు, కార్యకర్తలకు సెల్‌ఫోన్లు
- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రతి కేంద్రానికీ మెడికల్ కిట్ పంపిన ప్రభుత్వం



ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆంగ్లంలో బోధిస్తున్న కార్యకర్త

పుట్టపర్తి అర్బన్: గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే కేంద్రాలుగా మాత్రమే ఉండేవి. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీల రూపురేఖలను మార్చేసింది. చిన్నారుల బంగారు భవిత కోసం అంగన్‌వాడీ స్థాయిలోనే ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తోంది. ఫలితంగా చిన్నారులు ప్రాథమిక పాఠశాలకు చేరుకునే సరికే ఇంగ్లిష్‌లో పదాలు రాసే స్థాయికి చేరేలా తీర్చిదిద్దుతోంది. ఈ మేరకు ఇప్పటికే ఇంగ్లిష్ బోధనపై కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇక కేంద్రాలకు ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 పుస్తకాలను చేర్చారు.

బోధనలోనూ సమూల మార్పులు..
అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారి బోధన సామర్థ్యం పెంచారు. బొమ్మలు, సంజ్ఞలతో ఆంగ్ల అక్షరాలను నేర్పేలా శిక్షణ ఇచ్చారు. అలాగే కార్పొరేట్ పాఠశాలలు, ప్లేస్కూళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చి దిద్దుతున్నారు. విద్యాకేంద్రం ప్రారంభానికి ముందే అంగన్‌వాడీలకు గణితం వర్క్ బుక్, యాక్టివిటీ బుక్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ వర్క్ బుక్‌లు అందిస్తున్నారు. అలాగే 'నాడు- నేడు' పనులతో అంగన్‌వాడీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడీలకు నూతన భవన నిర్మాణాలు చేపట్టారు.

సిబ్బందికి సెల్‌ఫోన్లు..
అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు ప్రభుత్వమే సెల్‌ఫోన్లు అందించింది. 2022 సెప్టెంబర్‌లో వీటిని ప్రతి కార్యకర్తకూ అందజేశారు. వీటితో ఆన్‌లైన్ వర్క్‌తో పాటు పౌష్టికాహారం పంపిణీ, ఇమ్యునైజేషన్, గర్భిణుల ఎత్తు, బరువుల నమోదు, రోజు వారీ హాజరు తదితర అంశాలను పొందుపరచనున్నారు. గృహ సందర్శన చేసిన సమయంలోనూ గర్భిణులకు, చిన్నారుల ఎదుగుదలకు సూచనలిచ్చేందుకు అవసరమైన సమస్త సమాచారాన్ని యాప్‌లలో పొందుపర్చి వాటిని సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేశారు. దీంతో అంగన్‌వాడీ పని కూడా సులువైంది.

ప్రథమ్ కోఆర్డినేషన్‌తో విలువైన సమాచారం..
ప్రథమ్ కోఆర్డినేషన్‌తో రోజూ స్టేట్ రిసోర్స్ గ్రూపు నుంచి జిల్లా రిసోర్స్ గ్రూపునకు అక్కడి నుంచి సూపర్ వైజర్లకు వారి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల మొబైళ్లకు విలువైన సమాచారం అందుతోంది. ఏరోజుకారోజు సిలబస్‌ను మొబైళ్లకు పంపుతారు. 'నేటి కార్యక్రమం' పేరుతో కార్యకర్తలకు అందిన సమాచారాన్ని పేరెంట్స్ గ్రూపునకూ చేరుతుంది. స్మార్ట్ ఫోన్ లేని పేరెంట్స్‌కు సంక్షిప్త సమాచారం రూపంలో పంపుతున్నారు. ఇందులో భాగంగా 2021 విద్యా సంవత్సరంలో జిల్లాలోని పీపీ-1 చిన్నారులకు 26,613 పుస్తకాలు, పీపీ-2 చిన్నారులకు 23,143 పుస్తకాలను అందజేశారు. 2022 సంవత్సరంలో పీపీ-1కు ,పీపీ-2కు కలిపి 60,372 పుస్తకాలను అందజేశారు.

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు	07
అంగన్‌వాడీ మెయిన్ కేంద్రాలు	2,207
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	617
పనిచేస్తున్న కార్యకర్తలు	2,254
1 నుంచి మూడేళ్లలోపు చిన్నారులు	47,601
3 నుంచి ఆరేళ్లలోపు వయస్సున్న చిన్నారులు	46,081

పౌష్టికాహారంలోనూ ప్రత్యేక ముద్ర..
గత ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు, బాలామృతం, బాలసంజీవిని కిట్లు అందజేసేవి. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం పౌష్టికాహారంలోనూ సమూల మార్పులు చేసింది. నాణ్యమైన పాల ప్యాకెట్లు, నెలకు మూడు సార్లు గుడ్లు, బాలామృతంతో పాటు అదనంగా వైఎస్సార్ కిట్‌లో చిక్కీలు, అటుకులు, బెల్లం, రాగిపిండి, జొన్నపిండి, ఖర్జూరాలు, బియ్యం, బేడలు, ఆయిల్ అందిస్తోంది. గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపడుతోంది.



సెల్‌ఫోన్లు అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్(ఫైల్)



అంగన్‌వాడీ కేంద్రానికి అందజేసిన మందులు

అందుబాటులో మందులు..
అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న వారికి ఏదైన చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే అందించేందుకు వీలుగా ఒక్కో కేంద్రానికి ఒక్కో మెడికల్ కిట్ పంపిణీ చేశారు. మెడికల్ కిట్‌లో పారాసిటమాల్, ఆల్‌బెండజోల్ మాత్రలు, నియోమైసిన్ ఆయింట్‌మెంట్, కాటన్, సిల్వర్ సల్ఫాడైజిల్, క్లోరో ఫినరమిన్, బెంజాయిల బెంజోవిట్ తదితర మందులు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వీటిని వాడుకునే అవకాశం కల్పించారు.

బలోపేతం చేస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని విభాగాల్లోనూ బలోపేతం చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి ఆంగ్ల బోధన ప్రారంభించాం. జిల్లాలోనే అన్ని కేంద్రాలకు పీపీ-1, పీపీ-2కు సంబంధించి మూడేసి పుస్తకాలు అందజేశాం. కార్యకర్తలకు మొదటి విడత శిక్షణ కూడా పూర్తి చేశాం. ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీలను తీర్చి దిద్దుతున్నాం. ఇంగ్లిష్ బోధనపై సిబ్బందికి సూచనలిచ్చాం. ప్రతి అంగన్‌వాడీకీ సెల్‌ఫోన్లు, మెడికల్ కిట్ అందజేశాం. – లక్ష్మీకుమారి, ఐసీడీఎస్ పీడీ

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు
- భ్రూణహత్యల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి
- అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం



సమీక్షిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం స్కానింగ్ సెంటర్లు, స్త్రీ వ్యాధి నిపుణులున్న ఆస్పత్రులపై నిఘా ఉంచాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ (పీసీ అండ్ పీఎన్‌డీటీ) చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లలో అన్ని రకాల పరికరాలు ఉన్నాయా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటికే ఉన్న స్కానింగ్, గైనిక్, సంతాన సాఫల్య కేంద్రాల రెన్యూవల్, కొత్తగా ఏర్పాటు చేయనున్న కేంద్రాల అనుమతులకు సంబంధించి 26 దరఖాస్తు రాగా, వాటిన్నింటినీ కమిటీ సభ్యులు పరిశీలించి ఆమోదించారు. సమావేశంలో హిందూపురం అడిషనల్ జిల్లా జడ్జి కె.శైలజ, డీఎస్పీ టీడీ యశ్వంత్, డీఎంహెచ్‌ఓ ఎస్. వెంకట కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, అనంతపురం న్యాయ సలహాదారు ఆశాలత, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ సిర్రప్ప, డెమో బాబా ఫకృద్దీన్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మడకశిర ఉన్నత పాఠశాలలో 'నాడు-నేడు' పనులను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్,



టీచర్ శోభారాణిని అభినందించి విద్యార్థులతో ముచ్చటిస్తున్న దృశ్యం

మీపై చర్యలు తప్పవు
- తప్పుడు నివేదికలతో ఎవరిని మోసం చేస్తారు..?
- ఆర్జేడీ, ఇన్‌చార్జ్ డీఈఓ, ఎంఈఓపై ప్రవీణ్ ప్రకాశ్ మండిపాటు
- మడకశిర, గుడిబండ మండలాల్లోని పలు పాఠశాలల తనిఖీ

మడకశిర/గుడిబండ: "3, 4, 5 తరగతుల పిల్లలకు స్కూల్ అసిస్టెంట్లకు బదులు...ఎస్జీటీలు బోధిస్తున్నారు. రిపోర్టులో మాత్రం స్కూల్ అసిస్టెంట్లను నియమించినట్లు చూపారు. ఎవరిని మోసం చేద్దామనుకుంటున్నారు..? ఇందుకు మీరంతా మూల్యం చెల్లించుకోవాల్సిందే... చర్యలకు సిద్ధంగా ఉండండి" అని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్... ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, మడకశిర ఇన్‌చార్జ్ ఎంఈఓ భాస్కర్ శ్రీనివాస్‌ను హెచ్చరించారు. శనివారం ఆయన మడకశిర, గుడిబండ మండలాల్లో పర్యటించారు. తొలుత ఆయన మడకశిర ఉన్నత పాఠశాలను సందర్శించి 3, 4, 5వ తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. చిన్నారుల వద్ద ఉన్న పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. ఇదే సందర్భంలో పాఠశాల ఉపాధ్యాయుల వివరాలను ఇన్‌చార్జ్ డీఈఓ, ఎంఈఓలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలలోని 3, 4, 5వ తరగతి విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు కాకుండా ఎస్జీటీలు పాఠాలు చెబుతున్న విషయాన్ని ప్రవీణ్ ప్రకాశ్ గుర్తించారు. ఎందుకు స్కూల్ అసిస్టెంట్లను నియమించలేదని ప్రశ్నించారు. ఇందుకు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల హెచ్ఎంగా ఉన్న భాస్కర్ శ్రీనివాస్ ఇన్‌చార్జ్ ఎంఈఓగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో ప్రవీణ్ ప్రకాష్ అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏ టీచర్... ఏ సబ్జెక్ట్ చెబుతున్నారో తెలియకపోతే ఎలా అన్నారు. వాస్తవాలను దాచి కమిషనరేట్‌కు నివేదిక పంపడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆర్జేడీ, డీఈఓ, ఎంఈఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'నాడు-నేడు' పనులపై అసంతృప్తి ..
మడకశిర ఉన్నత పాఠశాలలో రెండో విడత 'నాడు-నేడు' కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడాన్ని గమనించిన ప్రవీణ్ ప్రకాష్...పీఆర్ డీఈ పద్మావతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను ఎందుకు సకాలంలో పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మరుగుదొడ్ల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా...మీరెందుకు పట్టించుకోవడం లేదని ఆర్జేడీ, ఇన్‌చార్జ్ డీఈఓపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే 'నాడు-నేడు' పనుల వివరాలు కూడా పీఆర్ డీఈ పూర్తిస్థాయిలో అందించకపోవడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వెంటనే నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు.

ఉపాధ్యాయురాలు శోభారాణికి అభినందన..
అంతకుముందు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మడకశిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 4వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు సంబంధించిన పలు ప్రశ్నలు అడగ్గా... అన్ని ప్రశ్నలకూ విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్ టీచర్ శోభారాణి సేవలకు కితాబు ఇచ్చారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట ఇంటర్ విద్య ఆర్జేడీ రవి, డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బోధన మెరుగు పర్చుకోవాలి..
గుడిబండ మండలం బూదిపల్లి ప్రాథమిక పాఠశాలనూ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. వాటిని ఇంతవరకూ ఉపాధ్యాయులు పరిశీలించలేదని తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు తనిఖీ చేయకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం మోరుబాగల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. ఉపాధ్యాయులే ఇంతవరకూ ట్యాబ్‌లు వాడటం లేదని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలన్నీ.. గడువులోపు పూర్తి కావాలి



చెన్నేకొత్తపల్లి: మేడాపురం లేఅవుట్ వద్ద అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్

- అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం
- జిల్లాలోని పలు జగనన్న లేఅవుట్‌ల పరిశీలన

పెనుకొండ/చెన్నేకొత్తపల్లి: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలన్నీ గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం వద్ద ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లను సందర్శించారు. ఆయా లేఅవుట్లలో నిర్మాణాలు పరిశీలించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తొలుత పెనుకొండలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్...ఇప్పటికే 400 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా లబ్ధిదారులను చైతన్యవంతులను చేసి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం వద్ద ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మేడాపురం జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ప్రభుత్వం 183 ఇళ్లు మంజూరు చేసిందని, ఆప్షన్-1, 2 కింద ఉన్న ఇళ్ల నిర్మాణాలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆప్షన్ -3 కింద 63 ఇళ్లు రూఫ్ లెవల్ వరకు రాగా, వాటిని కూడా వేగవంతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ శంకర్ లాల్, ఏఈలు శ్రీనాథ్, హరినాయక్, ఎంపీడీఓలు అశోక్ నాయక్, శివశంకరప్ప, పెనుకొండ తహసీల్దార్ స్వర్ణలత, పెనుకొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఆర్‌ఏఎఫ్ కవాతు

ధర్మవరం అర్బన్: సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత పర్యవేక్షణ అంశంపై అధ్యయనం చేసేందుకు జిల్లాకు చేరుకున్న హకీంపేట 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బలగాలు... శనివారం ధర్మవరంలో కవాతు నిర్వహించాయి. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వరకూ కొనసాగింది. కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, పట్టణ సీఐలు సుబ్రహ్మణ్యం, రాజా, వహీద్‌బాషా, ఎస్‌ఐలు మహమ్మద్‌రఫీ, శేషగిరిరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిని గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డిని ఉమ్మడి జిల్లా పోలీసు అధికారుల సంఘం సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. దీంతో ఉద్యోగులు మరిన్ని అదనపు ప్రయోజనాలు పొందుతారని హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌ఆర్‌ఏ కూడా పెరుగుతుందని, పుట్టపర్తిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరూ స్థానికత, ఆధార్‌తో పాటు పుట్టపర్తి పట్టణ పరిధిలోని నివాసం ఏర్పరుచుకోవాలని సూచించారు. దీంతో పట్టణ జనాభ పెరిగి వీలైనంత త్వరగా గ్రేడ్–1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాకే త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, తేజ్‌పాల్, పుట్టపర్తి సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, అడ్మిన్ ఆర్‌ఐ టైటాస్ పాల్గొన్నారు.

రెండు వాహనాల ఢీ

- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక అనంతపురం రహదారిపై బోరంపల్లి వద్ద రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. ఇందులో ఐదుగురికి తీవ్ర గాయగాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన 14 మంది శివ మాలాధారులు, మరో ఐదుగురు ఓ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఇరుముడులతో శ్రీశైలం యాత్రకు వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణమైన వీరు శనివారం తెల్లవారుజాము 4 గంటలకు కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వద్దకు చేరుకోగానే గొంచిరెడ్డిపల్లి నుంచి టమాట లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో శివమాలాధారుల వాహనం రోడ్డు పక్కన బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న వీరన్న, హనుమంతరాయుడు, తిప్పేస్, బొమ్మయ్య, రాజప్పకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో వీరన్న పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సమాచారం అందుకున్న మంత్రి ఉషశ్రీ చరణ్ వెంటనే ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరుపై క్షతగాత్రులతో ఆరా తీశారు.



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోలీస్ డైరీ ఆవిష్కరణ

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారుల సమక్షంలో పోలీస్ డైరీని ఆవిష్కరించారు. ఏస్పీ రామకృష్ణప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, తేజ్‌పాల్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, అడ్మిన్ ఆర్‌ఐ టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి



కళ్యాణి (ఫైల్)

పెనుకొండ రూరల్: జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కారు (స్కార్పియో) ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అలవల కళ్యాణి (65), మురళీకృష్ణ దంపతులు శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో గుట్టూరు వద్దకు చేరుకోగానే డ్రైవర్ బస్సును ఆపి టీ తాగేందుకు సమీపంలోని హోటల్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో నిద్ర లేచిన కళ్యాణి మూత్ర విసర్జనకు వెళ్లే క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న స్కార్పియో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కళ్యాణిని 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పెనుకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని పాతకోటలో నివాసముంటున్న షేక్ గౌస్, ఖతీజా (38) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం భర్తకు తెలియకుండా ఖతీజా ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసింది. దీంతో పాటు సొంత పూచీకత్తుపై తన ఇంటి సమీపంలోని కొందరికి అప్పులు ఇప్పించింది. ఈ క్రమంలో అప్పులు చెల్లించడంలో ఇబ్బందులు తలెత్తడంతో తరచూ వడ్డీ వ్యాపారులు ఇంటి వద్దకు చేరుకుని దుర్భాషలాడడం మొదలుపెట్టారు. ఈ విషయం తన భర్తకు తెలిస్తే గొడవ వుతుందని భావించిన ఆమె శనివారం ఉదయం 9 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు పేట వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం



పేట వేంకటరమణస్వామి మూలవిరాట్



రథాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని మెయిన్ బజార్ వెలసిన పేట వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం నుంచి ఐదు లాంతర్ల సర్కిల్ వరకు ఊరేగింపు సాగనుంది.

కల్యాణం... కమనీయం

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయంలో జ్యేష్టాదేవి, శనీశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కల్యాణోత్సవానికి ముందు వేద పండితులు స్వామివారికి అభిషేకాలు అవాహిత దేవతారాధన, ధ్వజారోహణ, దీక్షా హోమం తదితర పూజలు చేశారు.



కల్యాణోత్సవ నిర్వహిస్తున్న దృశ్యం

13న అప్రెంటిస్ మేళా

లేపాక్షి: స్థానిక వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బద్రీనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మేళాకు జిల్లాలోని వివిధ పారిశ్రామికవేత్తలు హాజరై తమ పరిశ్రమ అవసరాలకు తగిన వారిని ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి ఉన్న వారు apprenticeshipindia.ors వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో 13వ తేదీ ఉదయం 10 గంటలకు మేళాకు హాజరుకావాలన్నారు.

నేడు రంగనాథుడి రథోత్సవం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహనంపై దేవేరులతో కలసి రంగనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఒంటిపై తెల్లటి గీతల చొక్కా, నల్లటి జీన్స్‌ప్యాంట్ ధరించాడున్నారు. మృతుని వివరాలు, ఆచూకీ తెలిస్తే 7013064687 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఐరావతంపై కొండమీదరాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దేవరులతో కలసి ఐరావత వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు బుక్కరాయసముద్రంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు సూర్య ప్రభ వాహన సేవ ఉంటుంది. 11.30 గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

హోరాహోరీగా తైక్వాండో పోటీలు



విజేతకు మెడల్ అందిస్తున్న తహసీల్దార్ రామాంజినేయులురెడ్డి

కొత్తచెరువు: మండలంలోని కేశాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 62 మంది క్రీడాకారులు తలపడ్డారు. అండర్– 11, 14 విభాగంలో విజేతలుగా నవదీప్‌రెడ్డి, ఆర్.పి. వచన్, చేతన్‌రెడ్డి, సౌరబ్‌దాస్, బాలికల విభాగంలో కార్తీక, అర్పిత, మౌన్యశ్రీ, లిఖిత నిలిచారు. విజేతలకు పతకాలను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నారపరెడ్డి, సర్పంచ్‌లు నరేంద్రరెడ్డి, ప్రకాష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయండి



ఇళ్ల నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ నాగభూషణం

గోరంట్ల: ఉగాది నాటికి గృహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సచివాలయ ఇంజనీర్లు, హౌసింగ్ సిబ్బందికి హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ నాగభూషణం ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన మల్లాపల్లి సమీపంలోని జగనన్న కాలనీని శ్రీసత్యసాయి జిల్లా పీడీ చంద్రమౌళిరెడ్డితో కలసి సందర్శించారు. గోరంట్ల మండలంలో 1350 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలన్నారు.

వ్యాను బోల్తా.. ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో బోల్తాపడిన ఓమ్ని వాహనం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44 జాతీయ రహదారిపై గుట్టూరు కనుమ సమీపంలో ఓమ్ని వ్యాన్ బోల్తా పడగా ముగ్గురు గాయపడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. క్షతగాత్రుల వివరాలమేరకు.. అనంతపురం జిల్లా యాడికి మండలంలోని రాయలచెరువు నుంచి పెళ్లి తిరిగింపుల అనంతరం స్వగ్రామమైన సోమందేపల్లిలోని కొత్తపల్లికి వెళ్తుండగా గుట్టూరు కనుమ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా మరో వాహనం తగలడంతో ఓమిని అదుపుతప్పి బోల్తా పడింది. మొత్తం ఓమినిలో 8 మంది ప్రయాణిస్తుండగా లక్ష్మి అనే మహిళకు బలమైన గాయాలయ్యాయి. నూతన వధూవరులు రాజశేఖర్, రాజేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. లక్ష్మిని చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

దంపతులకు జైలుశిక్ష

యల్లనూరు: భూ వివాదంలో దాడికి పాల్పడిన దంపతులకు జైలు శిక్ష విధిస్తూ తాడిపత్రి న్యాయస్థానం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు... యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లిలో భూమి విషయంగా 2015లో కె.సుబ్బరాయుడు, కె.రామకృష్ణ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ సమయంలో సుబ్బరాయుడుపై దంపతులు రామకృష్ణ, పార్వతి దాడిచేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అప్పట్లో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో రామకృష్ణ, పార్వతి దంపతులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తాడిపత్రి న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది.